క్లుప్తంగా

విద్యార్థులకు యుద్ధవిద్యలు అవసరం

ఎస్‌ఐ ప్రణయ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్‌ఐ ప్రణయ్

షాద్‌నగర్: విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలని ఎస్‌ఐ ప్రణయ్ సూచించారు. ఆదివారం పట్టణంలోని యూనిక్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జిల్లాస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎస్‌ఐ ప్రణయ్ మాట్లాడుతూ... ఆపద సమయంలో ఎదుటి వారి నుంచి తమను తాము రక్షించుకునేందుకు కరాటే, కుంగ్‌ఫూ ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులు విధిగా యుద్ధ విద్యలను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు అహ్మద్‌ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయంవద్ద అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత జీటీ.సంతోష్, శ్యామల దంపతుల సహకారంతో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్యను పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షులు సంతోష్, రమేష్, కోశాధికారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి జంగరాజ్, ప్రచార కార్యదర్శి సురేష్, సభ్యుల భరత్, కృష్ణ, తరుణ్, భాను, శ్రీకాంత్, శివ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



తుక్కుగూడ: జెన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢ అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, పూజారులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ భారతాన్ని జీఎస్టీ సంస్కరణలు మార్చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. పన్నుల మార్పులు మాత్రమే కాకుండా పశుపోషణ, మత్స్యకార వృత్తి, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటి వరకు రైతులు ఉపయోగిస్తున్న పరికరాలపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వచ్చిందని, ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చిన కొత్త సంస్కరణల ద్వారా ఐదు శాతానికి తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ నిర్ణయం అందరికీ ఆదర్శంగా ఉందన్నారు.

వీసా ఫీజు పెంపుతో విద్యార్థులకు నష్టం

చేవెళ్ల: అమెరికా ప్రభుత్వం ప్రకటించిన హెచ్–1బీ వీసా ఫీజు పెంపు నిర్ణయం సరైంది కాదని బీజేపీ చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యువ విద్యార్థులైన ఐటీ, వైద్యులు, ఇంజనీర్లు వంటి ప్రతిభావంతులకు భారీ ఆర్థిక భారంగా మారుతుందన్నారు. మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల అమెరికా కలలను సాకారం చేయటంలో అడ్డంకిగా మారిందన్నారు. అలాగే నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 3కే రన్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నంతో పాల్గొన్నానని చెప్పారు.



షాద్‌నగర్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయం



చేవెళ్ల: రచ్చబండ వద్ద సిద్ధమైన దుర్గామాత మండపం

మొదలైన దసరా వైభవం

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

- మండపాలు సిద్ధం చేసిన నిర్వాహకులు
- షాద్‌నగర్‌లో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

చేవెళ్ల/షాద్‌నగర్/షాబాద్: దసరా పండగ సందర్భంగా నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కోరూపంలో అలంకరించనున్నారు. నిత్యం పంచామృత అభిషేకం, గణపతిపూజ, మంటపారాధన, కుంకుమార్చన, హోమం, నివేదన వంటి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. దసరా రోజు శమీపూజ, వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

అలంకరణలు ప్రత్యేకం

ఊరూరా దసరా సందడి మొదలైంది. ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా సకల శక్తి స్వరూపిణి ఆదిపరాశక్తి, జగన్మాతను తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఉత్సవాల తొలిరోజు 22న సోమవారం బాలాత్రిపురసుందరీ దేవిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయినీదేవిగా, 26న మహాలక్ష్మిగా, 27న లలితా త్రిపురసుందరీగా, 28న మహాచండీ, 29న మహాసరస్వతి, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిగా, 2న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వేదపండితులు పేర్కొన్నారు. ఆయా మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆలయాల వద్ద దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించనున్నారు. ఇందుకోసం యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంటపాలు సిద్ధమయ్యాయి.



లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చేవెళ్లలో కొలువైన శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఫౌండర్‌ట్రస్టీ దేవుని వామనాచార్యులు, ఈఓ నరేందర్ పేర్కొన్నారు. 22న అఖండ దీపారాధన, లక్షార్చన సహస్ర దీపాలకంరణ, కలశ స్థాపన, వేదపారాయణం, రాత్రి పల్లకీ సేవలతో ప్రారంభమవుతాయని చెప్పారు. 23న రాత్రి 7 గంటలకు పల్లకీసేవ, 24న చంద్రప్రభ వాహనసేవ, 25న హంసవాహన, 26న సింహవాహన, 27న



రథోత్సవం, 28న శేషవాహన, 29న గజవాహన, 30న హనుమంత వాహన, 1న గరుడవాహన, 2న తేదీన చక్రతీర్థం(తెప్పోత్సవం) అశ్వవాహన సేవలతో పాటు అర్చన, శమీపూజ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు

షాద్‌నగర్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారిపల్లి, చించోడ్, భీమారం, ఉప్పరిగడ్డ తండాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించే ప్రాంతాలను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి పంట పొలాలను సందర్శించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే పచ్చని పంట పొలాల గుండా రోడ్డును నిర్మించడం సరికాదన్నారు. పాడి పంటలు, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సుమారు 300 ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో చేసిన మార్కింగ్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు శ్రీనునాయక్, సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, రజినీకాంత్, సత్యం, సాయన్న, సత్తయ్య, శ్రీధర్‌నాయక్, సూర్యనాయక్, భాస్కర్, హరీష్, శ్రీకాంత్, వెంకటయ్య, మాధవి, నవీన్, శివ, నర్సింలు, కృష్ణ, సాయన్న, జ్యోతి బాబు, గోపాల్, సురేష్, శివయ్య, సత్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలి



గోపూజలో వాసవీ, వనితాక్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం

షాద్‌నగర్‌రూరల్: సకల దేవతల నిలయమైన గోమాతను ప్రతిఒక్కరూ పూజించాలని వాసవీక్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం అన్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోగల శ్రీకృష్ణ గోశాలలో ఆదివారం వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని అన్నారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు కల్వమధుప్రియ, వాసవీ క్లబ్ కోశాధికారి సురేష్ కుమార్, జోన్ చైర్మన్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులుగుప్తా, సభ్యులు నందకిషోర్, మురళి, రవికుమార్, పాండు, శ్రీనివాస్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురిసె.. పంటలు మునిగె



చాకలిగూడలో మొక్కజొన్న పంటలోకి చేరిన వరద నీరు

మొయినాబాద్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో వరద నీరు చేరుకుంది. శ్రీరామ్‌నగర్–వెంకటాపూర్ గ్రామాల మధ్యలో గల చిన్న వాగు వంతెనపై నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే విధంగా చాకలిగూడ, వెంకటాపూర్ రహదారి పక్కన మొక్కజొన్న పంటలో భారీగా వర్షం నీరు చేరింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నీటి పాలైందని కర్షకులు వాపోయారు.

కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకే ముఖ్యం

కందుకూరు: కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల నిజమైన ప్రేమ లేదని, ఓటు బ్యాంకు కోసమే 42 శాతం రిజర్వేషన్లు అని చెబుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలపై ప్రేమ ఉంటే.. ఆ వర్గం బిడ్డలైన కందుకూరు, మహేశ్వరం మండలాల పీఏసీఎస్ చైర్మన్లు చంద్రశేఖర్, పాండుయాదవ్‌ను తొలగించి, ఓసీలను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తూ.. రిజర్వేషన్లు కల్పిస్తామంటే ఎలా నమ్మాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, కుమ్మర సంఘం అధ్యక్షుడు రవి, వడ్డెర సంఘం అధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు.

నషాముక్త్ భారత్‌కు కృషి

బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్

మొయినాబాద్‌రూరల్: నషాముక్త్ భారత్ చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ గుండె, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం డ్రగ్స్ రహిత భారత లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో 3కే రన్ కార్యక్రమం నగరంలో నిర్వహించారు. దీనికి మొయినాబాద్ మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పరిపాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని వారు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, మధుసూదన్ రెడ్డి, జ్ఞానేశ్వర్, నర్సింహారెడ్డి, రాజమల్లేష్, శివకుమార్, రవీందర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.



3కే రన్‌కు బయలుదేరిన నాయకులు

తీరొక్క పూలు పేర్చి.. సంబురం పంచి



చేవెళ్లలో బతుకమ్మతో చిన్నారి



మొయినాబాద్‌రూరల్: బాకారంలో ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు



షాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చేవెళ్ల: ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలను ఆదివారం నుంచి మహిళలు ప్రారంభించారు. చేవెళ్ల మండలంలోని గ్రామాల్లో రంగురంగుల పూజలతో బతుకమ్మలను తయారు చేసి ఘనంగా నిర్వహించారు. మహిళలు, పిల్లలు బతుకమ్మలను తయారు చేసి కాలనీలలో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో

మొయినాబాద్: ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు సంబురంగా జరుపుకొన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అప్పోజీగూడ గ్రామాల్లో మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. చిన్నారులు, మహిళలు బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు, కుంటల్లో బతుకమ్మలను వదిలారు.

సంస్కృతికి ప్రతీక

షాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని రామాలయంలో మహిళలు బతుకమ్మ సంబురాలు ధూంధాంగా నిర్వహించారు. మహిళలు రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చుకొని పాటలు పాడారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో ఆదివారం ఎంగిలపూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి పూజించి ఆడి పాడారు.

ఎంగిలిపూల బతుకమ్మ

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా బతుకమ్మ సంబరాలను మహిళలు జరుపుకోవడం ఆదర్శనీయమని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్ అన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ గ్రామాలలో ఆదివారం మహిళలు తీరొక్క పూలను ఒక్క చోటకు చేర్చి బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో మా ఇంటి గౌరమ్మ ఉయ్యాల అంటూ ఆటపాటలతో సందడి చేశారు.

తొమ్మిది రోజులు ఉత్సాహంగా



బతుకమ్మ వేడుకలను తొమ్మిది రోజుల పాటు ప్రత్యేకంగా జరుపుకొంటారు. మహిళలు పోటీ పడి వివిధ రకాల పూలను తెచ్చి అందంగా పేర్చడం పలువురిని ఆకట్టుకుంటుంది. మా చిన్నతనంలో అడవులకు వెళ్లి తంగేడు, గునుగు తదితర పూలను తెచ్చి బతుకమ్మలు చేసేవాళ్లం.

– జ్యోతి, మాజీ ఎంపీపీ, షాబాద్

తెలంగాణ సంస్కృతికి అద్దం



బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుంది. పూర్వం నుంచి ఇప్పటివరకు ఈ పండుగకు ఉన్న విశిష్టత ఎంతో గొప్పది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా బతుకమ్మ పండుగను నిర్వహించడం సంతోషకరం. అందరూ కలిసి బతుకమ్మ సంబరాలు జరుపుకోవాలి.

– శ్రీనివాస్, పంతులు, షాబాద్



శంకర్‌పల్లి: మోకిలలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శంకర్‌పల్లి పట్టణంలో బతుకమ్మతో మహిళలు



మొయినాబాద్: సురంగల్‌లో బతుకమ్మలతో మహిళలు



చేవెళ్లలోని న్యూ జర్నలిస్ట్ కాలనీలో బతుకమ్మ వేడుకలో మహిళలు

ఎన్‌సీసీ కేర్‌టేకర్‌కు పతకం



శ్రీయను అభినందిస్తున్న డాక్టర్ రూప

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని బంగారు పతకం సాధించింది. కళాశాలలో ఎంజెడ్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీయ ఎన్‌సీసీ క్యాడెట్లకు కేర్ టేకర్‌గా పని చేస్తుంది. ఇటీవల మెహిదీపట్నంలోని గ్యారిసన్‌లో ఎన్‌సీసీ బాలికల బెటాలియన్(క్యాట్) శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 120 మంది క్యాడెట్లలో శ్రీయ ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో బంగారు పతకం అందజేశారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ రూప చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె, అధ్యాపకులు, విద్యార్థినులు ఆమెను అభినందించారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



హోమం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు: నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవలో గడపాలని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని పులిమామిడి పరిధి నిఖిల్ చేతనా కేంద్రంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆటుపోట్లను ఎదుర్కొవాలంటే సాధనకు మించిన మార్గం మరొకటి లేదని తెలిపారు. తోటివారితో స్నేహంగా మెలగాలన్నారు.